పల్లెల చెంతకు మెరుగైన వైద్యం

- ప్రజారోగ్యానికి భరోసా
- అందుబాటులో 24 గంటల వైద్య సేవలు
- నియోజకవర్గంలో రూ.14.59 కోట్లతో 70 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం


మద్దికెరలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు


విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మద్దికెర: పల్లె ప్రజలకు ఇంటి వద్దే అన్ని సేవలు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆరోగ్యమే మహాభాగ్యమని భావించి పల్లె ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నియోజకవర్గానికి 70 హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేశారు. రూ.14.59 కోట్లతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గ్రామ సచివాలయం పరిధిలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే మొత్తం చికిత్సకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపచేస్తోంది. ప్రతి మండలానికి 108, 104 వాహనాలను అందించి వైద్య సేవలు వేగవంతం చేసింది. సచివాలయాల్లో ఏఎన్‌ఎంలను నియమించి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో వైద్య సేవలు పల్లెలకు మరింత చేరువ కానున్నాయి. గతంలో మాదిరిగా ప్రతి చిన్న వైద్య అవసరానికి పట్టణాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా క్లినిక్‌ల ద్వారా 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యంగా 54 రకాల మందులు, అన్నివేళలా క్లినిక్‌లు అందుబాటులో ఉండనున్నాయి. గర్భిణులకు నెలవారి వైద్య పరీక్షల కోసం మండల కేంద్రానికి వెళ్లే పనిలేకుండా ఈ కేంద్రాలలో పరీక్షలు చేసేలా చర్యలు, ప్రణాళికలు రూపొందించారు. ఒక్కో హెల్త్ క్లినిక్‌ను రూ.20.84 లక్షలతో నిర్మిస్తున్నారు.

మండలాల వారీగా నిర్మిస్తున్న హెల్త్ క్లినిక్‌లు	
మద్దికెర	8
పత్తికొండ	15
తుగ్గలి	17
వెల్దుర్తి	17
కృష్ణగిరి	13
మొత్తం	70



సకాలంలో వైద్య సేవలు



గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు వీలవుతుంది. అంతేగాక గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుంది. దీంతో వ్యయప్రయాసలు పడకుండా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.

– శ్రీలక్ష్మి, ప్రభుత్వ వైద్యాధికారిణి

పల్లెల్లో వైద్య సేవలు హర్షణీయం



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి 16 కి.మీ దూరం ఉంది. వైద్య పరీక్షలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెలో వైద్య సేవలు అందించేలా హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ఇక్కడే వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాం. హెల్త్ క్లినిక్‌లతో మాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– సావిత్రి, బసినేపల్లి

సీఎం నిర్ణయం అభినందనీయం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి పల్లెల్లోని ప్రజలకు సకాలంలో వైద్యం అందించేలా చర్యలు చేపట్టడం అభినందనీయం. గ్రామస్థాయిలో ప్రాథమిక వైద్యం అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– నరసింహారెడ్డి, బురుజుల

క్లుప్తంగా

21న మహాదేవప్ప తాత ఆరాధన

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో వెలసిన మహాదేవప్ప తాత 36వ ఆరాధనోత్సవాలు ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆరోజు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, గణపతి పూజ, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించునున్నట్లు చెప్పారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం, భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

నేడు సురక్ష వైద్య శిబిరాలు

మద్దికెర: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దికెర–3 సచివాలయ పరిధిలోని కెనరా బ్యాంకు వద్ద ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి గురువారం తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తుగ్గలి: మండల పరిధిలోని కడమకుంట్లలో శుక్రవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు ఆవుల ఆదిలక్ష్మి తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణులు హాజరై ప్రజలకు వైద్యసేవలందిస్తారన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ప్రదీప్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

నేటి నుంచి కులగణన సర్వే

తుగ్గలి: మండలంలో శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభవుతుందని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. ప్రజల స్థితిగతులు, వివిధ సామాజిక వర్గాల జనాభాను తెలుసుకునే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు. వలంటీర్ల సాయంతో ఈనెల 28వతేదీ వరకు సచివాలయ ఉద్యోగులు సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

మద్దికెర: మండలంలోని గ్రామాలలో శుక్రవారం నుంచి కులగణన సర్వే చేపట్టనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ తిరిగి చేపట్టే సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు యోగి నరసింహ స్వామి రథోత్సవం


యోగి నరసింహస్వామి

పత్తికొండ రూరల్: పత్తికొండ–హోసూరు గ్రామాల మధ్య నరసింహ స్వామి తోటలో కొలువుదీరిన మహాత్మాయోగి నరసింహ స్వామి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా నిర్వహించే ఈ రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. 19న ఆరాధన సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, రథాంగహోమం, రథోత్సవ కలశస్థాపన, తీర్థప్రసాద వినియోగం, రాత్రి భజన ఉంటుంది. 20న మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో రావాలని, అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.

బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: స్థానిక హరిజన వీధిలో పూలకొండ రంగస్వామి గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందడంతో సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం మృతుడి భార్య జయమ్మకు రూ.10 వేలు అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

పత్తికొండ రూరల్: పత్తికొండలో విశ్వహిందూ పరిషత్ తాలుకా అధ్యక్షుడు వీరరాజులు ఆధ్వర్యంలో గురువారం అయోధ్య రామయ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రధాన రోడ్డు వెంట ర్యాలీగా వస్తూ పవిత్రమైన శ్రీరాముడి అక్షింతలను పట్టణ ప్రముఖులకు, అధికారులకు అందజేశారు. అయోధ్యలో ఈ నెల 22న జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రతిఒక్కరూ వీక్షించి పునీతులు కావాలన్నారు. రంజిత్, దండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

21న మెగా వైద్యశిబిరం

పత్తికొండ రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో ఈనెల 21న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నేత్ర జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. శాంతిరాం హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగే కంటి పరీక్ష, ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గుండె, కిడ్నీ సంబంధిత రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


అక్రమ మద్యంతో పాటు సీజ్ చేసిన ఆటోను చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: మండలంలోని ధర్మపురం టోల్‌గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. టోల్‌గేట్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆదోనికి చెందిన బోయ రాధమ్మ, ఈరమ్మ, జంగం శివకుమార్ ఆటోలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితుల నుంచి కర్ణాటక మద్యం 768 జాన్స్ ఒరిజినల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

సొంత ఖర్చుతో దారి నిర్మాణం


బోగోలు - గుంటుపల్లె దారి పనులను పరిశీలిస్తున్న కంగాటి వెంకట్రామిరెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బోగోలు వైఎస్సార్‌సీపీ నాయకుడు, రైతు కంగాటి వెంకట్రామిరెడ్డి తన సొంత ఖర్చు రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించి ఆదర్శంగా నిలిచాడు. మండల కేంద్రానికి దూరంగా గల బోగోలు గ్రామం వెళ్లాలంటే గోవర్ధనగిరి మీదుగా ప్రయాణం చేయాల్సి ఉంది. హైవే–44 చేరేందుకు వీరికి దగ్గరిదారి వయా గుంటుపల్లె ఉంది. గుంటుపల్లె నుంచి హైవేకు ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మించి ఆ గ్రామ సమస్యను తీర్చింది. అంతేగాకుండా గ్రామ చెరువుకు హంద్రీ - నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా నీరందించడంతో కళకలలాడుతోంది. అయితే బోగోలు వరకు దారి సరిగాలేక గ్రామస్తులు గుంటుపల్లె మీదుగా ప్రయాణించేందుకు ఇబ్బందులు పడేవారు. చెరువు నిండి పొలాలు పండించుకునే రైతులకు సైతం దారి సమస్య ఎదురైంది. సమస్యను గుర్తించిన గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి వెంకట్రామిరెడ్డి గ్రామస్తులతో చర్చించి సొంతంగా రూ.10 లక్షలు వెచ్చించి 2 కి.మీ మేర గ్రావెల్ రోడ్డు గుంటుపల్లె వరకు నిర్మించారు. తోడు వచ్చిన రైతులు సూర్యనారాయణ రెడ్డి, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, శివరాముడు, మద్దిలేటి తదితరులతో కలిసి పూర్తయిన దారిని పరిశీలించారు. ఏళ్లనాటి దారి సమస్య తీర్చడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బుసినే విరుపాక్షి

చిప్పగిరి: నియోకవర్గ పరిధిలోని బాపురం, మొలగవల్లి, హత్తిబెళగల్ తదితర గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 35 కుటుంబాల వారు గురువారం వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, మల్లికార్జున, మంజునాథ, నాగరాజు, నరసప్ప, బసప్ప, రంగస్వామి, బసవరాజు, మద్దిలేటి, రమేష్, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

హొళగుంద: ప్రజలకు చేసిన మేలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందిస్తుందని, రాష్ట్రానికి వైఎస్ జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పార్టీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి అన్నారు. గురువారం ఆయన తనయుడు చంద్రశేఖర్‌తో కలిసి ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్నారు. వారికి దర్గా ఈఓ అబ్దుల్ రహిమాన్, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. దర్గా నిర్వాహకులు ప్రత్యేక ఫాతెహాలు చేయించారు. అనంతరం విరుపాక్షి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించారని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు దర్గన్న, ఎస్కే గిరి, ఈరన్న, చిన్నహ్యాట మల్లి, రామకృష్ణ, దొడ్డబసప్ప, పంపాపతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పరిపాలనపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

నందవరం: గ్రామ పరిపాలనపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై (జీపీడీపీ) రెండవరోజు వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు కృషి చేయాలన్నారు. పంచాయతీ పరిధిలో వచ్చే నిధులు, వాటి వినియోగం, ఏఏ పనులకు నిధులు ఖర్చు చేయాలన్న విషయాలను వివరించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు, ట్రైనర్లు దొరబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



గోనెగండ్లలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ నాగేష్, తుగ్గలిలో జీపీడీపీ శిక్షణకు హాజరైన సచివాలయ సిబ్బంది

గోనెగండ్ల: గ్రామాల అభివృద్ధిలో అధికారులదే ముఖ్యపాత్రని ఈఓఆర్డీ నాగేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై వెల్ఫేర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పంచాయతీల్లో గ్రామాల సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికలతో గ్రామాభివృద్ధి

తుగ్గలి: పటిష్ట ప్రణాళికలతోనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ సావిత్రి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి–ప్రణాళికలపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారుచేయాలన్నారు. అనంతరం రీసోర్స్‌పర్సన్ శివకుమార్ జీపీడీపీపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు అంకాలప్ప, రాజునాయక్, రామాంజినేయులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


బెల్లం ఊటను ధ్వసం చేస్తున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా కొండల్లో గురువారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. సారా తయారు చేసే స్థావరాలను గుర్తించి అక్కడ బిందెల్లో నిల్వ ఉంచిన 1,500 లీటర్ల బెల్లం ఊట, ఐదు లీటర్ల సారాతో పాటు బిందెలను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి


సామాజిక సమతా సంకల్పంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పురస్కరించుకొని గురువారం పట్టణంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, మున్సిపల్ అధికారులు ర్యాలీగా వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక సమతా సంకల్పంపై ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఆర్‌ఓ బేబి, ఏఈ మదన్, మున్సిపల్, మెప్మా సిబ్బంది, వార్డు కౌన్సిలర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరుటౌన్/తుగ్గలి/నందవరం: నియోజకవర్గంలోని వ్యవసాయ కనెక్షన్లకు శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రాఘవేంద్ర గురువారం పేర్కొన్నారు. కర్నూలులోని 220 కేవీ విద్యుత్ మెయిన్ లైన్ మరమ్మతుల దృష్ట్యా అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, అలాగే సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. అలాగే తుగ్గలి, నందవరం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు తెలిపారు.

వాహనాల తనిఖీ

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ నాగేంద్ర గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహన పత్రాలను పరిశీలించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఎస్‌ఐ మాట్లాతూ వాహనదారులు నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి

ఆలూరు: వాల్మీకుల హక్కుల సాధనకై 10 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు స్థానిక అంబేడ్కర్ కూడలిలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. నాయకులు అర్జున్, సురేంద్ర, వరుణ్, క్రాంతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు


నాగలదిన్నె వంతెన వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: వాహనదారులు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వంతెన వద్ద నిర్మిస్తున్న పోలీసు చెక్‌పోస్టును డీఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో వంతెన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బ్రిడ్జిపై అసాంఘిక కార్యలాపాలు, వాహనాలలో అక్రమ రవాణాకు పాల్పడితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టే నేపథ్యంలో తనిఖీలు చేపట్టామన్నారు. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలని సూచించారు. కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల పనులు


ముగతిలో సీసీ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలోని కలగట్ల రోడ్డులో డ్రైయినేజీ పనులు పూర్తి కావడంతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీ భారతమ్మ కొట్టం నుంచి లాజర్ ఇంటి వరకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనులను గురువారం పీఆర్ ఏఈ జయన్న పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.


హొళగుంద బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: హొళగుంద బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. చాలా ఏళ్లుగా సీసీ రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండడంతో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనులను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కెంచప్ప, మల్లికార్జున, శివన్న, హనుమప్ప, మల్లయ్య తదితరులు పరిశీలించారు. రోడ్డు నిర్మాణంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

బెజవాడకు బిరబిరా..


కృష్ణగిరి: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలివెళుతున్న నాయకులు


మద్దికెర: బయలుదేరేముందు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తుగ్గలి: అణగారిన, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు అహర్నిశలు శ్రమించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్ అన్నారు. విజయవాడలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల భారీ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించి జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో తుగ్గలి నుంచి వివిధ సామాజిక వర్గాల వారు బస్సులో బయలుదేరి వెళ్లారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్మృతివనాన్ని సీఎం ప్రారంభించడం మరో చరిత్రకు నాంది పలుకుతుందన్నారు.

కృష్ణగిరి: విజయవాడలో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలుస్తుందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి కృష్ణగిరిలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం విజయవాడకు బస్సులో బయలుదేరి వెళ్లారు.

మద్దికెర: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని రాష్ట్రంలో ఆవిష్కరించడం దేశానికే గర్వకారణమని ఎంపీడీఓ నరసింహమూర్తి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని అన్నారు. గురువారం మండలం నుంచి విజయవాడలో జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నాయకులు బస్సులో తరలివెళ్లారు.

వికసిత్ భారత్ కార్యక్రమం

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఆంతోనీ, తహసీల్దార్ మల్లికార్జున, బీజేపీ మండలాధ్యక్షులు బసవరాజు, సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏఓ శివశంకర్, ఏపీఎం శివయ్య, ఏపీఓ హేమసుందర్, హౌసింగ్ ఏఈ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ


ట్రోఫీ అందుకుంటున్న వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టు

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణానికి చెందిన టీవీఎస్ మినరల్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచి రూ.10,016 నగదు బహుమతి, ట్రోఫీ గెలుచుకుంది. 33 జట్లు తలపడిన ఈ టోర్నీలో గురువారం ఫైనల్‌లో వెల్దుర్తి గట్టి ఎలెవెన్, వెల్దుర్తి యశ్వంత్ ఎలెవెన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యశ్వంత్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 34 పరుగులకు ఆలౌట్ కాగా ప్రత్యర్థి జట్టు వికెట్ నష్ట పోకుండా టార్గెట్ చేధించి విజేతగా నిలిచింది. విజేతలకు, రన్నర్స్‌కు (రూ.5,016) నగదు బహుమతులను దాత టీవీఎస్ శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్ నాయుడు, చక్రపాణిరెడ్డి, ట్రోఫీలను దాత, నిర్వాహకుడు వెంకటప్పనాయుడు అందించారు. నిర్వాహకులు బోయపాటి వెంకి, మధు, చందు, మహేశ్, హరి పాల్గొన్నారు.